ప్రజాశక్తి

సోమవారం 10 ఫిబ్రవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ప్రజాగళంగా లక్ష్మణరావు

- అన్ని తరగతుల ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం
- రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్సీగా 14 ఏళ్ల ప్రస్థానం
- మండలి ఎన్నికల బరిలో మరోసారి
- నేడు గుంటూరులో నామినేషను దాఖలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో శాసన మండలి పునరుద్ధరణ తరువాత సుదీర్ఘకాలం పనిచేసిన ఎమ్మెల్సీల్లో కె.ఎస్.లక్ష్మణరావు ప్రముఖంగా నిలుస్తున్నారు. గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తూ 2007లో తొలిసారిగా శాసన మండలి సభ్యులుగా ఆయన ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన 3 సార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఒకసారి ఓడిపోయారు. ఐదోసారి ఈనెల 27న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. 14 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయన అన్ని తరగతుల ప్రజల గొంతుకగా పనిచేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, మహిళలు, అంగన్‌వాడీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలతో పాటు పెన్షనర్లు, వివిధ తరగతులకు చెందిన సమస్యలపై మండలిలో పోరాడారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను

2లో

నామినేషన్ ప్రారంభ సభ

కెఎస్ లక్ష్మణరావు నామినేషన్ దాఖలుకు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, బి.గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్, గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా సహాధ్యక్షులు కుసుమ కుమారి, గ్రాడ్యుయేట్ నియోజకవర్గం కన్వీనర్ ఎం.హనుమంతరావు, ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ టిఎల్‌ఎస్‌ఎన్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ ప్రారంభం అవుతుందని, అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయంకు నామినేషన్లు వేసేందుకు వెళ్లనున్నారని నాయకులు తెలిపారు.

భారీ ర్యాలీగా నామినేషన్‌కు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గానికి పోటి చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఉదయం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో పాల్గొని అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో టీచర్లు, గ్రాడ్యుయేట్ల సమస్యలపై ప్రాతినిధ్యం కోసం ఏర్పాటు చేసిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ రాజకీయ పార్టీలు నేరుగా పోటీ చేస్తున్నాయని లక్ష్మణరావు అన్నారు. అన్ని రంగాల ప్రజలకు మండలిలో గొంతుకగా ఉంటానని తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజా సంఘాల శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రసకందాయంలో టిడిపి రాజకీయం

- పెమ్మసానికి షాక్ ఇచ్చిన కార్పొరేటర్లు
- కోవెలమూడి పేరు చెప్పగానే అసంతృప్తి వెల్లువ
- ఎమ్మెల్యేలను ఒప్పించుకోవాలని రవీంద్రకు సూచన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడిపై అవిశ్వాసం నెగ్గిన తరువాత టిడిపి కూటమి తరుఫున మేయర్ అభ్యర్థినిని ప్రకటించాల్సిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కొంత తొందరపడి ఇబ్బందుల్లో పడ్డారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే గల్లా మాధవి నివాసంలో జరిగిన టిడిపి కూటమి కార్పొరేటర్ల ఆత్మీయ సమావేశానికి 32 మంది వరకు హాజరు అయ్యారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్పొరేటర్లను పెమ్మసాని అభినందించారు. పలు అంశాలపై చర్చించిన తరువాత తదుపరి మేయర్ అభ్యర్థిగా టిడిపి కూటమి నుంచి 37వ డివిజన్ కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర పేరును కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రకటించారు. అప్పటి వరకు సరదాగా గడిపిన కూటమి కార్పొరేటర్లలో కొంత మంది ఇబ్బందికి గురయ్యారు. పెమ్మసాని నిర్ణయాన్ని 12 మంది కార్పొరేటర్లు తప్పుపట్టారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ముందు నుంచి నగరానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు వైసిపి నుంచి 12 మంది కార్పొరేటర్లను టిడిపిలో తీసుకుని రావడంలో కీలక భూమి పోషించారు. వీరిని సంప్రదించకుండా, మొత్తం కూటమిలో ఉన్న కార్పొరేటర్ల అభిప్రాయాలను తెలుసుకోకుండానే పెమ్మసాని కోవెలమూడి పేరు ప్రకటించగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము

2లో

టిడిపి కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న బాధితులు

'చీటి'ంగ్‌పై జనాగ్రహం!

- పిల్లల పెళ్లిళ్లు, చదువుకు డబ్బులు దాచుకున్నామని ఆవేదన
- తమను నిలువునా మోసగించారని వాపోయిన సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు
- న్యాయం చేయాలని టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ

6లో

మృతులు మధిర సామ్రాజ్యం, మధిర గంగమ్మ, తేనేపల్లి పద్మ, చక్కెర మాధవి మృతదేహాలు

కోసిన పంటే ప్రాణాలు తీసింది..!

ఉదయం నుండి సాయంత్రం వరకూ మిరప మొక్కల్లో కోరును తట్టుకుని ఉక్కపోతకు గురవతూ పంటను కోశారు.. పంట మొత్తాన్ని గోతాల్లో ఎత్తి ట్రాక్టర్‌పైకి చేర్చారు.. రెక్కల కష్టం నుండి అప్పుడే విరామం దొరికిన వారు ఇళ్లకెళ్దామని బయలుదేరారు.. తాము అప్పటి వరకూ కోసిన మిరపకాయల బస్తాల మీదే కూర్చుని మంచీ చెడూ మాట్లాడుకుంటున్నారు... మరో 20 నిమిషాలు ఆగితే అందరూ ఇళ్లకు చేరేవాళ్లు.. స్నానపానాలు కానిచ్చి తమ వారితో కలిసి ఆదమరిచి నిద్రించే వారు.. అయితే ఇంతలోనే డొంకరోడ్డు గుంతల రూపంలో మృత్యువు వారిని ఆవహించింది.. వారి మాటలు కాస్త చావు కేకలయ్యాయి.. తాము చేతులతో కోసిన మిరప కాయల బస్తాలో వారిపై పడి ఊపిరి తీశాయి.. సొంతూళ్లో చేతినిండా పనిలేక, ఉపాధి హామీ పనులైనా దక్కక పొరుగూళ్లకు వెళ్లాల్సిన దుస్థితి ఒకెత్తయితే అస్తవ్యస్త డొంక మార్గాల్లో ప్రయాణమూ వారి ప్రాణం మీదికి తెచ్చింది.. ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు మహిళా కూలీలు మృత్యువాత పడిన ఘటన ముప్పాళ్ల మండలం బొల్లవరం శివారు మాదల మేజర్ కాల్వ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది... (ప్రజాశక్తి - ముప్పాళ్ల)

పూర్తి వార్త మెయిన్ పేజీలో

WANTED

ప్రజాశక్తి దినపత్రిక

గుంటూరు సిటీ, మంగళగిరి, మాచర్ల లలో పనిచేసేందుకు సిబ్బంది కావలెను.

- గుంటూరు సిటీ - సబ్ ఎడిటర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, విలేఖర్లు
- మంగళగిరి - డివిజన్ కో-ఆర్డినేటర్/మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్
- మాచర్ల - డివిజన్ కో-ఆర్డినేటర్/మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్

ఆకర్షణీయమైన వేతనం, అలవెన్సులు ఇవ్వబడును.

గుంటూరులో పనిచేయుటకు యాడ్ డిజైనర్ కావలెను

ప్రజాశక్తి కార్యాలయం

2/18, బ్రాడీపేట, గుంటూరు.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 94900 99 225

నేడు జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నిర్మూలనం దినం

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా నేడు నిర్దేశిత వయస్సు కలిగిన పిల్లలు అందరూ అల్బెండజోల్ మాత్రలు మింగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. ఇందులో భాగంగా 1 నుండి 19 సంవత్సరాల పిల్లలందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నిర్మూలన కోసం 400 ఎంజి అల్బెండజోల్ బిళ్ళలను చప్పరించి మింగాలన్నారు. 1 నుండి 2 సం పిల్లలు అరమాత్ర, 2 నుండి 19 సంవత్సరముల పిల్లలు పూర్తి మాత్ర మింగాలని తెలియజేశారు. 10వ తేదీన తీసుకోలేని పిల్లలను 17వ తేదీన మాపప్‌లో మింగించాలన్నారు. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత గంట తేడాతో మాత్రలు ఇవ్వాలని, ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో అర్హులైన పిల్లలు 4,24,742 మంది ఉన్నారని, జిల్లాకు 4,50,000ల అల్బెండజోల్ మాత్రలు వచ్చాయన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తాన్నారు. నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లలలో రక్తహీనతను నివారించి, వారి ఆరోగ్యాన్ని సంరక్షించవచ్చని, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.

డాక్టర్ జయకుమార్‌ను సత్కరిస్తున్న వైద్యులు

డాక్టర్ రామకుమార్ వైద్యసేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

గత మూడు దశాబ్దాల క్రితం నగరంలో మధుమేహ వ్యాధి ఆసుపత్రి స్థాపించి వేలాదిమందికి వైద్యసేవలు అందించటంతో పాటు డయాబెటిక్ వైద్యసేవల ద్వారా పద్మశ్రీ అవార్డు గ్రహీత వి.శేషయ్య పేరుతో ప్రతి ఏటా లబ్ద ప్రతిష్టలైన వైద్యులకు గోల్డ్‌మెడల్స్ అందిస్తున్న డాక్టర్ వివి రామకుమార్ జాతీయస్థాయి సేవలు అభినందనీయమని గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.వి.సుందరాచారి పేర్కొన్నారు. ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్, డాక్టర్ వివి రామకుమార్ డయాబెటిస్ అకాడమీ అండ్ స్మైల్ డయాబెటిస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్ హోటల్ క్యాపిటల్ సమావేశం మందిరంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన షుగర్ వ్యాధి నిపుణులతో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సుందరాచారి, డాక్టర్ రమణ ఎస్ఎస్‌వి తదితరులు ఈ సదస్సును ప్రారంభించారు. డాక్టర్ జి.జయ్ కుమార్‌కు పద్మశ్రీ వి.శేషయ్య గోల్డ్ మెడల్‌ను అందించి సత్కరించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వి మాట్లాడుతూ డాక్టర్ రామ్‌కుమార్ ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులుగానే కాకుండా నగరంలోని వైద్యులందరికీ తన లాఫ్టర్ క్లబ్ ద్వారా నెలనెల హాస్య కార్యక్రమాలతో మానసిక ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచుతున్నారని అభినందించారు. డాక్టర్ వి.వి.రామకుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.కమలారామ్‌కుమార్, భవతరణి, పూజ, నగరంలోని ప్రముఖ షుగర్ వ్యాధి వైద్యులు పాల్గొన్నారు.

వినుకొండ నియోజకవర్గంలో 7600 ఓట్లు

ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నాయకుల సమన్వయంపై ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్ ఛార్జులతో పాటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యేలా ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధతో కషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లో సుమారు 7,600 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ప్రతి ఓటరును పార్టీ శ్రేణులు నేరుగా కలవాలని జీవీ సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అవకాశం కల్పించాలి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

డీఎస్సీ-2003 అభ్యర్థులకు తప్పనిసరిగా పాత పెన్షన్ విధానానికి అవకాశం కల్పించాలని ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు కోరారు. కుంచనపల్లి అరవింద హైస్కూల్లో డీఎస్సీ-2003 టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోపిదేవి శివశంకరరావు అధ్యక్షతన ఉపాధ్యాయుల సమస్యపై ఆదివారం సమావేశం జరిగింది. సుమారు 500 మందికి పైగా డీఎస్సీ 2003 అభ్యర్థులు పాల్గొన్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ కార్యదర్శి జానకిని కలిసి 2003 అభ్యర్థుల పాత పెన్షన్ అమలు చేయాలని కోరామని తెలిపారు. ఓపీఎస్ విధానం వచ్చేవరకూ పోరాటంలో భాగస్వామ్యం అవుతామని, ఉద్యమాలలో సంపూర్ణ మద్దతు ఇస్తామని ఉద్ఘాటించారు. రాబోయే శాసనమండలి సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యాలయం ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, కూటమి తరుపున ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ ప్రసంగించారు. 11 వేల మందికి పైగా పాత పెన్షన్ ఇవ్వాల్సి ఉందని, ఈ సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ, ఫోరం కన్వీనర్ ఎం.గురు బ్రహ్మం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, హాజరైన డిఎస్‌సి అభ్యర్థులు

ప్రజాగళంగా లక్ష్మణరావు

(మొదటి పేజీ తరువాయి)

పోషించారు. 2014 వరకు కాంగ్రెస్, 2014 నుంచి 2019 వరకు టిడిపి, 2019 నుంచి 2024 వరకు వైసిపి, తిరిగి ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వంలో కూడా వివిధ అంశాలపై మండలి సమావేశాల్లో ప్రభుత్వాలను ప్రజా సమస్యలపై నిలదీశారు. మండలిలో ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతోపాటు, బయట జరిగే ప్రజా ఉద్యమాల్లోనూ భాగస్వామ్యులయ్యారు.

గుంటూరు, కృష్ణా జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ గుంటూరు ఛానల్, వరికెపుడిశెల, కౌలురైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, ఇతర సమస్యలు, పట్టణాల్లో మౌలిక వసతులు, ఆర్‌వోబిలు, ఆర్‌యుబిలు, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలపై కూడా మండలితో పాటు గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా పరిషత్ సమావేశాల్లో, జిల్లా సమీక్ష కమిటీ (డిఆర్‌సి) సమావేశాల్లోనూ మాట్లాడుతున్నారు. లక్ష్మణరావు పోరాటం ఫలితంగా గుంటూరులో ఇప్పటికే పలు ఆర్‌వోబిలు మంజూరయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న వేలాది మందికి పట్టాలు ఇప్పించేందుకు, ప్రభుత్వ భూములలో ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్న వారికి క్రమబద్ధీకరణ పట్టాలు ఇప్పించేందుకు వివిధ దశల్లో జరిగిన పోరాటాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎ.కొండూరు మండలంలో కిడ్నీ బాధితుల సమస్యలపై మండలిలో ప్రముఖంగా ప్రస్తావించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులను అదుకునేలా కృషి చేశారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఈ మండలంలోని ప్రజలకు తాగునీటి పథకం మంజూరుకు ప్రభుత్వంపై వత్తిడి చేసి మంజూరు చేయించారు. గంపలగూడెం మండలంలో కట్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం పలుమార్లు మండలిలో ప్రస్తావించారు. ప్రభుత్వ అధికారులతో చర్చించి బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేశారు. మామిడి రైతుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించారు. మిర్చి రైతులు, సుబాబుల్ సాగుదారుల సమస్యలపై పలుమార్లు అధికారులతో చర్చించడం, మండలిలో ప్రస్తావించడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనేక అంశాలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజామోద నిర్ణయాలు తీసుకుంటే మద్దతు ఇస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం కొనసాగించారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారానికి చేసే కృషి కంటే ప్రతిపక్ష పాత్ర పోషించే తనను ఎన్నుకుంటే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కెఎస్.లక్ష్మణరావు చెప్పారు.

రసకందాయంలో టిడిపి రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

కావటి మనోహర్ నాయుడితో పాటు ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి వ్యతిరేకంగా వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చామని ఇప్పుడు అప్పిరెడ్డి అనుకూలమైన వ్యక్తి కోవెలమూడిని ఎలా ఎంపిక చేస్తారని వైసిపి నుంచి వచ్చిన వారితోపాటు టిడిపిలో మేయర్ సీటును ఆశిస్తున్న వారు ప్రశ్నించారు. పార్టీ కోసం నిజాయితీగా కష్టపడి పనిచేసే వారికి అవకాశం ఇవ్వాలని వారు పెమ్మసానికి సూచించారని తెలిసింది. 12 మంది కార్పొరేటర్లు బయటకు వెళ్లిపోగానే ఎమ్మెల్యే గళ్ళా మాధవి కూడా లోపలికి వెళ్లిపోయారు. తరువాత నశీర్ అహ్మద్ కూడా నిష్క్రమించారు. ఈ పరిస్థితి చూసి పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. తరువాత ఎమ్మెల్యేలను ఒప్పించుకుంటే కొంత మేరకు అవకాశం ఉంటుందని లేదంటే తాను ఏమీచేయలేనని కోవెలమూడికి కేంద్ర మంత్రి పెమ్మసాని సూచించినట్టు తెలిసింది. వాస్తవంగా 32 మందిలో టిడిపి నుంచి గెలుపొందిన వారు 9 మంది, జనసేన నుంచి ఇద్దరు ఉన్నారు. మిగతా 21 మంది వైసిపి వారే టిడిపి కూటమిలో చేరారు. దీంతో ఇప్పుడు 32 మంది కార్పొరేటర్ల అభిప్రాయం మేరకు టిడిపి మేయర్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. కేవలం ఏకపక్షంగా ప్రకటిస్తే తాము తమ మార్గం చూసుకుంటామని వైసిపికి చెందిన కార్పొరేటర్లు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. సిఎం చంద్రబాబు సమక్షంలో 32 మందిని సమావేశపరిచి నిర్ణయం ప్రకటిస్తే బాగుంటుందని వారు అభిప్రాయ పడుతున్నారు. తాజా సమాచారం ప్రకారం పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్న వేములపల్లి శ్రీరాం ప్రసాద్, ఈరంటి వరప్రసాద్ పేర్లు కూడా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా మేయర్ కావటి మనో హర్ నాయుడ్ని తప్పిస్తున్నందున తమ సామా జిక తరగతికి అవకాశం ఇవ్వాలని జనసేన కార్పొరేటర్లు కూడా పట్టుబట్టే అవకాశం లేకపోలేదని మరో వాదన తెరపైకి వచ్చింది.

అమెరికా అమానుషత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించాలి

ప్రజాశక్తి - గుంటూరు

పొట్టకూటి కోసం తనను ఆశ్రయించిన వారి పట్ల అమానుషంగా.. హేయంగా ప్రవర్తిస్తున్న అమెరికాపై మన కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండటం తగదని, ఈ దారుణన్ని తీవ్రంగా ఖండించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది. సైనిక విమానంలో అమత్ సర్ చేరుకున్న వలసదారుల కథనాలు వింటుంటే దిగ్భ్రాంతి కలుగుతుందని, చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి కూర్చోవడానికి అసౌకర్యంగా ఉండే సైనిక విమానంలో పశువుల్ని తరలించిన చందాన మన వారిని తీసుకొస్తే కేంద్రం కనీసం వారికి సానుభూతి కూడా తెలియజేయలేదని అవగాహన సంస్థ విమర్శిస్తుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయులకు జరిగిన అవమానంపై పార్లమెంటులో ఆగ్రహవేశాలు వెల్లువెత్తటం సబబుగా ఉందని, తమది ప్రపంచంలోనే పురాతన ప్రజాస్వామ్య వ్యవస్థ అని స్వోత్కర్షకు పోయే అమెరికా దేశం వలసదారులను పశువుల కన్నా హీనంగా పరిగణించటం వారి కనీస మానవ హక్కులను బేఖాతరు చేయడమేనని అవగాహన సంస్థ ప్రకటిస్తుదన్నారు. వలసదారులు తిరుగుబాటు చేయడానికి రాలేదని, వారి దగ్గర మారణాయుధాలు ఉండవని ఏజెంట్లను నమ్మి లక్షలకు లక్షలు అర్పించుకొని తమ దగ్గరున్న కాగితాలు నిజమైనవేనన్న భ్రమలో ఉన్నవారు అనేక కష్టాలు పడి అమెరికా చేరుకొని, ఇంతకాలం ఆ దేశ ప్రజలకు రాత్రనకా, పగలనకా సేవలందించారని, వారి మూలంగా నిజంగా ఉపయోగపడిందని అమెరికా వారేనని తెలిపారు. కేంద్రం ఇప్పుడైనా పార్లమెంటులో వ్యక్తమైన అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని తప్పుని తప్పని చెప్పాలని అమెరికాకు నిరసన తెలియజేయాలని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలని అవగాహన సంస్థ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందని శివరామిరెడ్డి తెలి పారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలను ఉపేక్షించం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ నిబంధనల అమలును కఠినతరం చేస్తున్నట్టు వెస్టు ట్రాఫిక్ సిఐ సింగయ్య తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనారులకు

వీల్ లాకింగ్ సిస్టమ్ ప్రయోగించి రూ.8,280 అపరాధ రుసుమును విధించినట్టు తెలిపారు. అలాగే ఈస్టు ట్రాఫిక్ సర్కిల్‌లో కూడా ఒక్క వాహనానికి రూ.1035 చొప్పున జరిమానా విధించినట్టు సిఐ అశోక్ కుమార్ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పాదాచారులకు, ఇతర వాహదారులకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపరాదని, అలా నిలిపితే తప్పనిసరిగా అపరాధ రుసుమును విధించి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. వ్యాపార సముదాయాలు వారు, షాపింగ్ మాల్స్ వారు తప్పనిసరిగా తమకు సంబంధించి ఒక పార్కింగ్ స్థలాన్ని కేటాయించుకోవాలని, లేని పక్షంలో ఎవరి షాప్ ముందు అయితే వాహనాలు నిలిపి ఉంటాయో ఆ షాపుల వారిపై కూడా చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు వారు విధించిన నిబంధనలను వాహనదారులు తప్పకుండా పాటించి పోలీసు వారికి సహకరించాలని కోరారు.

పెండ్యాల సత్యన్నారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి - గుంటూరు : ప్రముఖ న్యాయ శాస్త్ర గ్రంథ రచయిత, వామపక్ష అభిమాని పెండ్యాల సత్యనారాయణ మతి అభ్యుదయ వాద ప్రజాతంత్ర వాద న్యాయ గ్రంథాల చదువరులకు, న్యాయవాదులకు తీరని లోటని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అత్యంత క్లిష్టమైన న్యాయ శాస్త్ర గ్రంథాలు సరళమైన వాడుక భాషలో వ్యాఖ్యాన సహితంగా అనువదించిన ఘనత పెండ్యాల సత్యనారాయణ దేనని అవగాహన సంస్థ నివాళులర్పిస్తుందని తెలిపారు. ఎందరో న్యాయ శాస్త్ర విద్యార్థులకు, న్యాయవాదులకు, పోలీస్ అకాడమీ వారికి ఆయన రచనలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. స్నేహశీలి, పరోపకారి, వామపక్ష అభిమాని సత్యనారాయణ విశేష సేవలు అందించారని, దాదాపు 40 సంవత్సరాల పాటు గుంటూరులో గడిపారని, గుంటూరు, గుంటూరు వాసులంటే ఆయనకు అభిమానమని అవగాహన సంస్థ జేజేలు పలికింది. అవగాహన సంస్థ సభ్యులు గా కొనసాగుతూ సంస్థ కార్యక్రమాల్లో పాల్గొన్న సూచనలు, సలహాలు ఇచ్చారు, రాజ్యాంగం మీద పెండ్యాల అవగాహనలో ఇచ్చిన ప్రసంగం సభ్యులందరికీ ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు.

మతాల పేరుతో దాడులు ఆందోళనకరం

- ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం అవసరం
- నాస్తిక మేళాలో పలువురు వక్తల ఉద్ఘాటన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

దేశంలో ఫాసిజం పెరిగిపోతోందని.. ప్రజలను వివిధ కులాలుగా విడగొడుతున్నారని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మతాల పేరుతో మైనారిటీలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రజలను చైతన్యం చేసి ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్యం చేసి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక చార్వాక ఆశ్రమంలో 33వ నాస్తిక మేళా రెండవ రోజు కార్యక్రమం జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు ఎన్.స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా 'భారతదేశంలో ఫాసిజం' అనే అంశంపై జరిగిన చర్చలో మానవ హక్కుల వేదిక తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ ఎస్.తిరుపతయ్య మాట్లాడుతూ ఫాసిజం పెరగడం వల్ల ప్రజాస్వామ్య హక్కులు హరణకు గురవుతున్నాయని చెప్పారు. మహిళల హక్కులు అణచివేతనకు గురవుతున్నాయని తెలిపారు. ప్రశ్నించిన వారిని జైళ్లలో బంధిస్తున్నారన్నారు. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారని, పత్రికలు పాలకుల అడుగులకు మడుగులొత్తే సాధనాలు అవుతున్నాయని చెప్పారు. ఒకవేళ ఏవైనా పత్రికలు ప్రజల సమస్యలను ఎత్తి చూపిస్తే వారిని వివిధ కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దేశద్రోహం

కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'పెరుగుతున్న ఫాసిజం - మన కర్తవ్యాలు' విద్యా పరిరక్షణ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ.. పాలకులు అన్ని రంగాలనూ తమ గుప్పెట్లో పెట్టుకొని ప్రజల మధ్య కుల, మత చిచ్చు పెడుతున్నారని తెలిపారు. రాజుల కాలంలో రాజ ద్రోహాలు ఉండేవని.. నేడు స్వతంత్ర దేశంలో రాజా ద్రోహాలు ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్రిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణంగా ఏ దేశంలోనైనా కార్మిక వర్గం బలంగా ఉంటే.. ఆ వర్గాన్ని అణచివేసేందుకు ఫాసిజం పుట్టుకొస్తుందన్నారు. మన దేశంలో కార్మిక వర్గం బలంగా లేకున్నా ఫాసిజం ముందుకు వస్తోందని తెలిపారు. మనోత్మాదాన్ని పెంచి పోషిస్తూ బలపడుతోందన్నారు. ఇదే సమయంలో దేశంలో ఉన్న వనరులను సామ్రాజ్యవాదులకు కట్టబెడుతూ ప్రజలను ఆర్థికంగానూ, సామాజికంగానూ వంచనకు గురి చేస్తున్నారని చెప్పారు. నూతన విద్యావిధానాలను పరిశీలిస్తే.. 80 శాతంగా ఉన్న దళిత బహుజనులకు వ్యతిరేకమైన విధానాలే అందులో ఉన్నాయన్నారు. ఈ విధానాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి, వారిని చైతన్యం చేయవలసిన అవసరం ఉందన్నారు.

అన్నింట్లోనూ కుల దోపిడీ

కులవివక్ష నిర్మూలన పోరాట సమితి జాతీయ నాయకులు కృష్ణ మాట్లాడుతూ.. మన దేశంలో సామాజిక వర్గమంటూ లేని ప్రాంతం కనిపించదన్నారు. రాజకీయాలు, ఆర్థిక విషయాలు, పెట్టుబడి, ధరించే దుస్తులు, ఎన్నికలు, పెళ్లి..చావు... ఎలా ఎందులో చూసినా కులం ఉంటుందన్నారు. అది అగ్రవర్ణాలకు మాత్రమే మేలు చేస్తుందన్నారు. అట్టడుగున ఉన్న దళిత బహుజనులకు ఇప్పటివరకు అన్నీ అవమానాలే అని అందోళన వ్యక్తం చేశారు. నిమ్న కులాలను వంచన చేస్తూ.. వారి సంపదను పెంచుకుంటూ ఉన్నారని తెలిపారు. సామాజిక వర్గ వివక్ష పోయేంతవరకు రిజర్వేషన్లు ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు తీసేయాలనుకుంటే ముందు కులాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక షరాఫ్ బజార్లోని భావనా రుషి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా కేంద్రం ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. నాట్యాచారిణి ఎం.వెంకటలక్ష్మి పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా నాట్య ప్రదర్శన చేశారు. సందర్శకుల మన్ననలను అందుకున్నారు.

డబుల్ ఇంజిన్‌కు ఆమోదం : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

దేశవ్యాప్తంగా ఎన్డీయే డబుల్ ఇంజిన్ సర్కార్లపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం, ఆమోదానికి ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనమే నిదర్శనమని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో చేరే ముందు కూడా అదే చెప్పామని, ఇప్పుడు దేశం మొత్తంగా అదే అంగీకరిస్తోందన్నారు. భారతీయ జనతా పార్టీ వినుకొండ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన కోట వెంకట సుధాకర్‌ను ఆదివారం చీఫ్ విప్ జీవీతోపాటు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఘనంగా సత్కరించి అభినందించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సూచించారు.

నేటి నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు

ప్రజాశక్తి - రెంటచింతల

సోమవారం నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 శివ నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు 9, ప్రైవేట్ పరంగా ఆరు కలిపి మొత్తం 15 పాఠశాలలు ఉన్నాయన్నారు. 812 మంది వరకు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలు చేరుకున్నాయని చెప్పారు.

ఉన్నత విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాల్సిన అవసరం ఉందని సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలో ఉన్న కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ మొదటి వార్షిక వేడుక ఆదివారం సందడిగా సాగింది. స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్, అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, వెంకట్ పూలబాల, నిఘంటు కర్త జీవన్ కుమార్, ప్రతిభ అవార్డు గ్రహీత, గోల్డ్ మెడలిస్ట్ బ్రహ్మనాయుడు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై.. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. మారుతున్న కుటుంబ వ్యవస్థలో పాఠశాలలే విద్యార్థులకు రెండవ ఇల్లన్నారు. పాఠశాలలో పిల్లలు ఏమి నేర్చుకోవాలి, పిల్లల అవసరాలకు ఏమేం ఉండాలని తెలియజేస్తూ కె-రిడ్జ్

విద్యార్థుల నృత్య ప్రదర్శన

దేశభక్తి గీతానికి విద్యార్థుల ప్రదర్శన

స్కూల్ అవలంబిస్తున్న విద్యా విధానాలను అభినందించారు. అదనపు ఎస్పీ సంతోష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో కొంత సమయాన్ని గడపాలని, వారి అభిప్రాయాలను తెలుసుకుని తగిన ప్రాధాన్య ఇవ్వాలని కోరారు. ర్యాగింగ్ పెను భూతాన్ని తరిమికొట్టాలని, అందుకు తమ నుంచి కూడా సహకారం అందిస్తామని తెలిపారు.

అనంతరం స్కూల్‌లోని చిన్నారులు పలు విభిన్న నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గేయాలు పాడి అలరించారు. పాఠశాలలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న బహుభాషా కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మ సెంటిమెంట్ తో పిల్లలు చేసిన నృత్యం అందరినీ కన్నీరు పెట్టించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ పుట్ట హేమంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరైన చికిత్సతో క్యాన్సర్ వ్యాధి దూరం

ప్రజాశక్తి-గుంటూరు

క్యాన్సర్ వ్యాధికి నేడు వైద్యం అందుబాటులోకి వచ్చిందని.. సకాలంలో చికిత్స తీసుకోవడం, మంచి ఆహారపు అలవాట్ల ద్వారా వ్యాధిని అరికట్టవచ్చని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ డీఎస్ రాజునాయుడు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలో ఆదివారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ వస్తే ప్రాణాలకు ముప్పు ఉండేదని.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని చెప్పారు. ప్రస్తుతం అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ప్రమాదకర క్యాన్సర్ రాకుండా మంచి ఆహార అలవాట్లు అనుసరించాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. రోజూ వ్యాయామం చేస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. సాధారణంగా మన శరీరంలో కణ విభజన జరుగుతుందని, ఆ కణ విభజన సాధారణ

మాట్లాడుతున్న డాక్టర్ రాజునాయుడు

ప్రక్రియలో కాకుండా అసంబద్ధంగా జరిగితే క్యాన్సర్‌కు దారితీస్తుందని వివరించారు. వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో టి.వి.సాయిరాం, ఎన్.విద్యాధరకుమార్, బి.సాంబశివరావు, హరి, చల్లా అంజిరెడ్డి, ఆర్.రామచంద్రరావు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి - పెదకాకాని

గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పెదకాకాని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మంగళగిరి మండలం ఖాజా గ్రామానికి చెందిన గంజిబోయిన శశాంక్ ఉరఫ్ శశి, మంగళగిరి పట్టణానికి చెందిన పెరుగు అనిల్ కుమార్ ఉరఫ్ పెరుగు అనే యువకులు కొన్నేళ్లుగా గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్నారు. విశాఖపట్నం వెళ్లి అర్జున్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, మంగళగిరి తీసుకొచ్చి, చిన్న ప్యాకెట్లుగా చేసి.. ఖాజా, మంగళగిరి, కాకాని, ఉప్పలపాడు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. అందిన సమాచారంతో పోలీసులు దాడులు చేసి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పెదకాకాని పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల

మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలో చికెన్ విక్రయించే దుకాణాల సమీపంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సి.హెచ్.నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపేటకు చెందిన అనుముల అజయ్(26) ప్రధాన రహదారిలో ఉన్న చేవూరి శ్రీనివాసరావు కిరాణా దుకాణంలో పనిచేస్తున్నాడు. దుకాణం పైన ఉన్న ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. శనివారం రాత్రి నుంచి మద్యం సేవించిన అజయ్.. ఆదివారం తెల్లవారుజామున విగతజీవిగా పడి ఉన్నాడు. అందిన ఫిర్యాదు మేరకు గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సిహెచ్ నాగార్జున ఘటనా స్థలిని పరిశీలించారు. కిందకు దిగే క్రమంలో డాబాపై నుంచి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడా? ఇంకేమైనా కారణాలున్నాయా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుని తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజు(ఫైల్‌ఫొటో)

బంధువు అంత్యక్రియల్లో పాల్గొని, ఇంటికి వచ్చిన అనంతరం గుండెపోటుకు గురై ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన కొప్పుల రాజు(48) మంగళగిరిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన సమీప బంధువు కొప్పుల ఆగ్నేసు అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఆదివారం ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్మశాన వాటిక నుంచి ఇంటికి వచ్చిన రాజు.. తనకు గుండెలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పారు. వెంటనే బంధువులు అతనిని తుళ్లూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్తుండగా.. మార్గమధ్యంలోనే ప్రాణాలు వదిలారు. మృతుని భార్య కూడా ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. రాజు మృతికి పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

వృద్ధులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-తెనాలి

సీనియర్ సిటిజన్స్ తమ ఆరోగ్యంపైనా దృష్టి సారించాలని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ ఎస్వీ కృష్ణారావు సూచించారు. ది తెనాలి సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ మధుమేహ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధిగ్రస్తులు శారీరక వ్యాయామం, ఆహార నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర సిటిజన్లను సత్కరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి నారాయణ రావు, కావూరి నాగేశ్వర రావు, పి.వి.రాంబాబు, అర్.భుజంగరావు, పి.మల్లికార్జునరావు, కె.చంద్రమౌళి, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అప్పుడు ఊదరగొట్టి.. ఇప్పుడు పక్కనబెట్టి..

- రబీ ముగుస్తున్నా పెట్టుబడి సాయం అందించని కూటమి ప్రభుత్వం
- 30 శాతం వరకూ పెరిగిన ఖర్చులతో రైతుల కష్టాలు

శనగ పొలానికి మందు వేయించే పనిలో రైతు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామనే హామీని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌లో మొండిచేయి చూపించింది. కనీసం రబీలోనైనా సాయం అందుతుందని భావిస్తున్న రైతులకు సీజన్ ముగింపు దశకు వస్తున్నా ఇప్పటికీ నిరీక్షణే మిగిలింది.

చిలకలూరిపేట మండలంలోని 13 వేల ఎకరాల్లో పత్తి, మిర్చి, పొగాకు, శనగ తదితర పంటలు సాగయ్యాయి. నియోజకవర్గ స్థాయిలో ఈ విస్తీర్ణం 33 వేల ఎకరాలకు పైగానే ఉంటుంది. సాగుదారుల్లో దాదపు 60 శాతం వరకూ కౌలురైతులే. గత ప్రభుత్వం రైతు భరోసా పేరుతో కేంద్రం అందించే మొత్తంతో కలిసి ఒక్కో రైతుకు రూ.13500 ఇచ్చింది. కౌలురైతుల్లో గుర్తింపు కార్డు ఉంటే ఓసీ సామాజిక తరగతికి చెందిన వారికి మినహా మిగతావారికీ రైతుభరోసాను వర్తింపజేసింది. అయితే కౌలురైతులకు గుర్తింపు కార్డు మంజూరులోనే నెలకొన్న అవాంతరాల వల్ల ఎక్కువ మంది కౌల్దార్లు రైతు భరోసాను పొందలేకపోయారు.

కూటమి నేతలు ఎన్నికలప్పుడు తాము అధికారంలోకి వస్తే కౌల్దార్లకూ పెట్టుబడి సాయాన్ని అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అందిస్తామని హామీనిచ్చింది. ఈ మొత్తం సాగులో తమకెంతో ఉపయోగపడుతుందని రైతులు భావించారు. మరోవైపు సాగు ఖర్చులు 30 శాతం వరకూ పెరిగాయి. పత్తికి పెట్టుబడి రూ.45కుపైగా అవుతుండా కౌలు రూ.15, మిర్చికి రూ.90 వేల పెట్టుబడి అవుతుండగా కౌలు రూ.15 వేలు అవుతోంది. పొగాకు సాగుకు పెట్టుబడి రూ.80 వరకు ఉండగా గతేడాది దిగుబడులు, ఆదాయం ఆధారంగా ఈ ఏడాది మరింత కౌలు పెంచి రూ.30 వేలకుపైగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇస్తే దానితో కౌలు చెల్లించుకుని సాగు ఖర్చులకు ఏదోలాగా తిప్పలు పడొచ్చని రైతులు భావించగా చివరికి అన్నింటికీ అధిక వడ్డీలకు అప్పులు చేయక తప్పలేదు. వాటికి వడ్డీలు పెరుగుతున్నా ప్రభుత్వం మాత్రం సాయం చేయడం లేదని, ఇక దిగుబడులు, వాటికి ధరలు ఎలా ఉంటాయోనని రైతులు ఆందోళనగా ఉన్నారు.

30 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం స్వామి స్కూల్‌లో 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రామిరెడ్డిపేటలోని రాధాసుందర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. 3 దశాబ్దాల అనంతరం కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. స్వామి స్కూల్ అధినేత ఇఎం స్వామి, గురువులు గోపాలకృష్ణమూర్తి, షేక్ షఫీ, మజీద్, షేక్ బషీర్, సుబ్బారావును సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి స్కూల్ అధినేత ఇఎం.స్వామి మాట్లాడుతూ తమ స్కూల్ నందు విద్యనభ్యసించిన విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వంగా ఉందన్నారు. ఏ రంగంలోనైనా ఇష్టంతో పని చేస్తే విజయం సిద్ధిస్తుందని, విజయం దాసోహం అవుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తమ పిల్లలు పెడదోవ పట్టకుండా మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దితే దేశానికి సేవ చేసినట్లే అవుతుందన్నారు. అనంతరం గురువులు, పూర్వ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం

ప్రజాసంఘాల నాయకులతోపాటు కరపత్రాలిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - క్రోసూరు : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంకిస్తూ క్రోసూరు మండలం యర్రబాలెంలో ఆదివారం ప్రచారం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, ప్రజా సంఘాలు బలపర్చిన లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులతోపాటు చిన్నారులు సైతం ప్రచారంలో పాల్గొని కరపత్రాలు అందజేశారు.

పిల్లల ప్రత్యేకతను గుర్తించి ప్రోత్సహించండి

శ్రీ కృష్ణచైతన్య విద్యాసంస్థల 20వ వార్షికోత్సవంలో వక్తలు

ఎమ్మెల్యే అరవిందబాబును సత్కరిస్తున్న కొల్లి బ్రహ్మయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని శ్రీ కృష్ణ చైతన్య విద్యా సంస్థల 20 వ వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. హాజరైన ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకున్నవారు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని, వారిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నీతి, నిజాయితీగా మెలగాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. 20 ఏళు ్లగా విద్యా సంస్థ నిర్వహిస్తూ పేద విద్యార్థులకు సైతం సాధారణ ఫీజులతో కార్పోరేట్ స్థాయి విద్యానందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్యను అభినందించారు. కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ తమ విద్యా సంస్థను లాభాపేక్షకు ప్రాధాన్యం లేకుండా నిర్వహిస్తున్నామని, అనుభవం కలిగిన అధ్యాపకులచే మెరుగైన విధానంలో ఒత్తిడి లేని విద్య బోధన అందిస్తున్నామని చెప్పారు. తమ వద్ద విద్యనభ్యసించిన విద్యార్థులు ఎందరో ఉన్నతంగా స్థిరపడ్డారని, బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం అతిథులను సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న ఫారెస్ట్ అసోసియేషన్ నాయకులు

జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి- మాచర్ల

తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మాచర్ల రేంజ్ ఆఫీసర్ కార్యాలయ ఆవరణలో అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ గుంటూరు యూనిట్ అధ్యక్షులు పి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ రేంజి సభ్యుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. సిబ్బంది కొరత ఎక్కువగా ఉండటం వల్ల పని భారం పెరిగిందని సభ్యులందరూ వాపోయారు. సమావేశంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మోహనరాజు, సెక్రటరీ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ షేక్ అమీర్ జానీబాష, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకయ్య, ట్రెజరర్ పురుషోత్తంరాజు పాల్గొన్నారు.

అళ్వార్ టైగర్ మారథాన్‌లో అబ్దుల్లాకు పతకం

ప్రజాశక్తి - వినుకొండ

రాజస్థాన్‌లో జరిగిన 'అళ్వార్ టైగర్ టెన్ కిలోమీటర్స్ మారథాన్' పరుగుల పోటీలో వినుకొండకు చెందిన షేక్ అబ్దుల్లా ప్రతిభ చూపాడు. ఈ పోటీలో మూడువేల మంది పాల్గొనగా అబ్దుల్లా ఏడవ స్థానంలో నిలిచాడు. ఈనెల 25న లడ్డాఖ్‌లో మంచు మీద జరిగే గిన్నిస్ బుక్ పరుగుల పోటీల్లో పాల్గొనే ప్రయత్నంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటున్నట్లు అబ్దుల్లా పేర్కొన్నాడు. తనకు ఆర్థికంగా సహకరించి మనోధైర్యాన్నిచ్చిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్, గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అజీజ్, గుంటూరులోని డాక్టర్ సాయికృష్ణ ప్రతిమా నర్సింగ్ హోమ్, ఎమ్‌డి కరీముల్లా, విశ్రాంత ఉద్యోగి షేక్ అప్సర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

షీల్డ్ తీసుకుంటున్న అల్తాఫ్

రాష్ట్రస్థాయి మెరిట్ టెస్ట్‌లో అల్తాఫ్ ప్రతిభ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాకేంద్రంలో ఆదివారం జరిగిన ఈఈఎంటి-2025 రాష్ట్రస్థాయి మెరిట్ టెస్ట్‌లో స్థానిక పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాల పదో తరగతి విద్యార్థి పఠాన్ మొహమ్మద్ అల్తాఫ్ 66 మార్కులతో పల్నాడు జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం యడవల్లి హనుమంతరావు తెలిపారు. అల్తాఫ్‌కు పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ వి.ఎన్.మస్తానయ్య బహుమతి ప్రదానం చేసినట్లు చెప్పారు. అల్తాఫ్‌ను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.సుదర్శన్, వైస్ చైర్మన్ గౌసియా, కౌన్సిలర్లు జె.సుబ్బారావు, మస్తాన్‌వలి, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు జి.హరిబాబు, జి.మధుసూదన్‌రావు అభినందించారు.

మాచర్ల 'బార్' అధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గంద్రకోట శ్రీనివాసరావు, పేరువాల అనీల్‌కుమార్ ఎన్నికైయారు. శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా గంగుల శ్రీనివాసరవు, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ గౌస్‌పాషా, జాయింట్ సెక్రటరీగా షేక్ నాగూర్ జానీ, లైబ్రేరియన్‌గా విడేల పుల్లారావు, లేడి రిప్రజెంటీవ్‌గా పూజల మాధవిలు ఎన్నికయ్యారు. నూతనంగా కార్యవర్గానికి సీనియర్ న్యాయవాదులు జివికెవి.రంగారావు, జె.నాగేశ్వరరావు, షేక్ గాలీబ్‌సాహెబ్, పి.వెంకటేశ్వర్లు, ఎ.ఉదయ్‌కుమార్‌రెడ్డి, వై.శ్రీనివారావు, బ్రహ్మాచారి, మణికంఠాచారి, బాబూరావు, రాంబాబు, దుర్గారావు, ఖాశీం అభినందనలు తెలిపారు.

లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజాసంఘాల ప్రచారం

ఉప్పలపాడులో ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఎన్నికల ప్రచార కరపత్రాలను పంచుతున్న సాంబిరెడ్డి

ముగ్గురోడ్డులో ప్రచారం చేపట్టిన ప్రజా సంఘాలనాయకులు

ప్రజాశక్తి, పెదనందిపాడు

ఫిబ్రవరి 27 న జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎలక్షన్స్‌లో పోటీ చేస్తున్న, అన్ని ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఉప్పలపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యల మీద నిరంతరం మండలి లోనూ, ప్రజా వేదికలపై తన గళాన్ని వినిపించే లక్ష్మణ్ రావు కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మన ప్రాంత సమస్యలను గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు అభివృద్ధి, ఇతర సమస్యలపై చేస్తున్న ప్రజా పోరాటాలకు లక్ష్మణరావు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజల మనిషి లక్ష్మణరావు గెలుపుకు అందరూ సహకరించాలని కోరారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరులో జరిగే కే.ఎస్.లక్ష్మణరావు నామి నేషన్ కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, జంపని రామారావు పాల్గొన్నారు.

తెనాలిరూరల్ : కృష్ణ,గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పి.డి.ఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.ఎస్ లక్ష్మణ్ రావును ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. స్థానిక ఐతానగర్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, పెన్షనర్లు నిరుద్యోగులు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, కౌలు రైతులు విద్యార్థి యువజన, అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలను శాసన మండలిలో తన గళాన్ని విప్పి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటమే కాకుండా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసిన నాయకుడు లక్ష్మణరావు అని అన్నారు. ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికలలో లక్ష్మణరావు కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పిల్లి రాజశేఖర్, ప్రకాష్, పిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో విస్తృత ప్రచారం

తాడేపల్లి : ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం తాడేపల్లిలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరిగి గ్రాడ్యుయేట్స్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై చట్టసభలలో తన గళం వినిపిస్తున్న లక్ష్మణరావు గెలిపించుకోవాలని ఈ సందర్భంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కృష్ణనగర్, నులకపేట, ప్రకాష్ నగర్, బ్రహ్మానందపురం, శేషయ్య హోటల్, ముగ్గు రోడ్డు ప్రాంతాల్లో ప్రచారం సాగింది. ప్రచారంలో ప్రజాసంఘాల నాయకులు దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి, వేముల దుర్గారావు, కోట బాబురావు , దర్శనపు విజయ్ బాబు, లీలమ్మ, గోపమ్మ, ఎమ్మెల నరసింహారావు, ఎస్ దుర్గారావు, బూర్ల రాజు పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయండి

కుంచనపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశం

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్, సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన నిరంతరం పోరాటం చేసే కృష్ణ గుంటూరు జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపునకు అందరు కృషి చేయా లని, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్య క్షులు పాశం రామారావు అన్నారు. ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి కాజా వెంకటేశ్వరరావు కారు షెడ్డు వద్ద, రైతు నాయకులు అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామారావు మాట్లాడుతూ మూడు పర్యాయాలుగా శాసనమండలి సభ్యుడిగా పని చేస్తూ, నీతి నిజాయితీకి మారుపేరుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన ప్రజల గొంతుకై లక్ష్మణరావు పనిచేశారన్నారు. జిల్లావ్యాప్తం గాను, మంగళగిరి నియోజకవర్గంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాల సమస్యల పైన ప్రజల పక్షాన నిలబడి, ఇళ్ల స్థలాలు, పట్టాల సాధన కోసం లక్ష్మణరావు కృషి చేశారన్నారు. జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్‌ని పూర్తి చేయాలని కృషి చేశారని పేర్కొన్నారు. తాడేపల్లి మండలంలోని చిర్రావూరు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పశువుల ఆసుపత్రికి డాక్టరును నియమించాలని, స్థానికంగా ఉన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యను పరిష్కరించాలని కృషి చేశారని అన్నారు. అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులు, మున్సిపల్ కార్మికుల చేస్తున్న పోరాటానికి మద్దతు తెలియజేయడమే కాక, వారి సమస్యలు పరిష్కారా నికి శాసనమండలిలో మాట్లాడారని అన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభు త్వం ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసిందని, ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలకు కావస్తున్న ఉచిత ఇసుక, సూపర్ సిక్స్ పథకాలు, అమ్మ ఒడి వంటివి అమలు కావడం లేదని ఆయన విమర్శించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని అన్నారు. కోట మీ ప్రభుత్వంలో భాగస్వామి అయిన తెలుగుదేశం జనసేన పార్టీలు కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం జరిగిన కూడా ప్రశ్నించడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు విస్మరించిన కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో దేవాలయాలపై హిందువు లకి హక్కు ఉండాలని విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆయన మండి పడ్డారు. ఇలాంటి పరిస్థితులలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యుదయ భావాలు ఉన్న ప్రజా సమస్యలపై నిరం తరం పోరాటం చేసే లక్ష్మణరావును గెలిపించు కోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలపై లక్ష్మణరావు పోరాటం చేశారని అన్నారు. నిరంతర ప్రజల మధ్య ఉంటూ కార్మిక కర్షక సమస్యలు పరిష్కారం కొరకు శాసనమండలిలో ప్రజా గొంతుకై పని చేసే లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయా ల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సిఐటియు తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లా డుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపైన పనిచేసిన లక్ష్మణరావును గెలిపించు కోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, రైతు సం ఘం నాయకులు డోకిపర్తి రాజేంద్ర బాబు, కంచర్ల భార్గవ్, అమ్మిశెట్టి సుధాకర్, గుడివాడ సామ్యూదాం, ఎస్.కె గన్, బుర్రా రాజు, ఆరుమళ్ళ నాగిరెడ్డి, మరియదాసు డేవిడ్ రాజు పాల్గొన్నారు.

దంతాలకు ప్రథమ శత్రువు సూక్ష్మజీవులే

మాట్లాడుతున్న డాక్టర్ చల్లా చైతన్య

ప్రజాశక్తి-గుంటూరు

దంతాలకు ప్రథమ శత్రువు సూక్ష్మజీవులేనని కాస్మోడెన్స్ దంత వైద్యశాల దంతవైద్య, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చల్లా చైతన్య అన్నారు. నోరు అనేక రకాల హానికర సూక్ష్మజీవులకు నిలయమని, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోకపోతే, నోటి దుర్వాసన, పుండ్లు పడడం, చిగుళ్ల వాపు, దంతాలు ఊడటం వంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'ఉచిత దంత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభలో' డాక్టర్ చైతన్య పాల్గొని ప్రసంగించారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ మెడికల్‌క్యాంప్ ఛైర్మన్ టి.ధనుంజయరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ వయసు పెరిగేకొద్దీ పళ్ళ ఊడిపోతాయనే భావన చాలామందిలో ఉందని, అయితే తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటే పళ్ళ ఊడటాన్ని నిరోధించవచ్చని అన్నారు. పోషకాహార లోపం, విటమిన్ల లోపం నోటి వ్యాధులకు కూడా కారణమవుతాయని అన్నారు. నోటిలో దాదాపు 200 నుండి 300 రకాల సూక్ష్మ జీవులు 10 మిలియన్ల దాకా ఉంటాయన్నారు. అవి మనం తినే ఆహార పదార్థాల్లోని పిండి పదార్థాలను, చక్కెరను వినియోగించుకుంటూ, వృద్ధి చెంది నోటి దుర్వాసనకు, దంత క్షయానికి కారణమవుతాయన్నారు. మనం నిద్రపోయే సమయంలో మరింతగా సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. దంతాలలో ఉండే సిమెంట్, ఎనామిల్, నిత్యం వివిధ రకాల సూక్ష్మజీవులకు, విషరసాయనాలకు గురవుతాయని, వీటికి తోడు చుట్ట, బీడీ, సిగరెట్, మద్యం, గుట్కా, ఖైని, పాన్‌మసాలా, వక్కపొడి నమిలే వారిలోను దంతక్షయం ఏర్పడుతుందన్నారు. కొందరిలో దంతాలలో రంధ్రాలు ఏర్పడతాయని, వీటినే మనం పిప్పిపళ్ళు అంటామన్నారు. ఈ రంధ్రాలలో ఆహార పదార్థాలు ఇరుక్కుపోయి, రంధ్రం కాస్త పెద్దదవుతుందని చెప్పారు. మొదట్లో నొప్పి ఉండదని, రంధ్రం పెరిగి చివరకు చిగురుకు తాకాక ఆహారం నమలాలంటే నొప్పి పుడుతుందన్నారు. అతి చల్లదనాన్ని అతి వేడిని భరించలేరన్నారు. కనీసం చల్లని గాలి తగిలినా నొప్పి వస్తుందన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకొని దంతాల సమస్యలను చాలావరకు నిరోధించవచ్చునన్నారు. రోజు ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలరాణి, మేకలరామారావు, చావాశివాజీ పాల్గొన్నారు.

నాగబ్రహ్మారెడ్డిని సత్కరిస్తున్న స్విమ్మింగ్ అసోసియేషన్ బృందం

స్విమ్మింగ్ విజేతలకు సన్మానం

ప్రజాశక్తి తెనాలి

స్విమ్మింగ్ పోటీలలో విజేతను జాగర్లమూడి స్విమ్మింగ్ అసోసియేషన్ బృందం ఆదివారం సత్కరించింది. ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణ రివర్ స్విమ్మింగ్ పోటీలు ఈనెల 2న జరిగాయి. జాగర్లమూడి స్విమ్మింగ్ అసోసియేషన్ నుంచి 31-40 విభాగంలో 20 మంది సభ్యులు పాల్గొనగా వారిలో పిట్టు నాగబ్రహ్మ రెడ్డి మూడవ స్థానంలో నిలిచాడు. స్విమ్మింగ్ అసోసి యేషన్ సభ్యులు నారాయణవాసు ఆధ్వర్యంలో నాగబ్రహ్మారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ బృందం, సభ్యులు పాల్గొన్నారు

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆంధ్రా ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా ముట్లూరు గ్రామంలో ఆంధ్రా ప్రైమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన వైద్యశిబిరంలో 260 మంది వైద్యసేవలు పొందారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, బ్లడ్‌గ్రూప్ పరీక్షలు, రక్తపోటు తనిఖీలు, ఇసిజి పరీక్షలు అందించారు. ఈ శిబిరంలో ఎండి జనరల్, కార్డియాలజీ, పల్మోనాలజిస్ట్, ఆప్తమాలజీ విభాగాలకు సంబంధించిన డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను డాక్టర్లు ప్రజలకు వివరించారు. డాక్టర్లు అచ్చంశెట్టి అన్వేష్ కుమార్, కాసుల సాయి రాజశేఖర్, సిహెచ్ జగదీష్, మాధవిలత, సాగర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఈ శ్రమ కార్డులకు చేనేత కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్రజాశక్తి మంగళగిరి

అసంఘటిత రంగ కార్మికుల కొరకు ప్రభుత్వం ఈశ్రమ కార్డులు కొరకు ప్రతి ఒక్క కార్మికుడు, చేనేత కార్మి కులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంగళగిరి అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి సిహెచ్ శ్రీరామమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ రంగంలో పనిచేసేవారైనా ఈ కార్డు కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. దీనివలన అనేక ప్రయోజనాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుండి రత్నాల చెరువులోని భద్రావతి గుడి సెంటర్లో జరుగుతుందని తెలిపారు. వివరాల కొరకు 9492555160 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, తాడికొండ మండలాల్లో గల అసంఘటిత రంగ కార్మికులు, చేనేత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

గుంటూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధితోపాటు, పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.



వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గజ్జల నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి, వైసీపీ రాష్ట్ర రైతు సలహా మండలి మాజీ సభ్యులు కె.విజయభాస్కర్ రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తం, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఒద్దుల రామకృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

గీత కార్మికుల లాటరీ ప్రక్రియ వాయిదా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించాల్సిన గీత కార్మికులకు సంబంధించిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా వేసినట్లు సత్తెనపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.విజయకుమార్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ తర్వాత ఎప్పుడు నిర్వహించేదీ ప్రకటిస్తామని చెప్పారు.

ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఈ నెల 15న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకుని విజయపురిసౌత్‌లోని సేవాలాల్ ఆలయం వద్ద వేడుక కరపత్రాలను ఆలయ ధర్మకర్త కరంటోత్ పాండు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాండు నాయక్ మాట్లాడుతూ 15న స్థానిక ఆలయంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ భీమా నాయక్, గిరిజన విద్యార్థి విభాగం(జీవిఎస్)రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ పాండు నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'చీటి'ంగ్‌పై జనాగ్రహం!

- పిల్లల పెళ్లిళ్లు, చదువుకు డబ్బులు దాచుకున్నామని ఆవేదన
- తమను నిలువునా మోసగించారని వాపోయిన సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు
- న్యాయం చేయాలని టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ
- అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ

బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చిట్టీలు, వడ్డీల రూపంలో వందల మంది నుంచి రూ.350 కోట్లకుపైగా నగదు వసూలు చేసి.. బోర్డు తిప్పేసిన సాయి సాధన చిట్ ఫండ్ సంస్థ బాధితులు ఆదివారం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని కమ్మ హాస్టల్‌లో సమావేశమయ్యారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పాలడుగు పుల్లారావు నుంచి తమ డబ్బులు ఇప్పించాలని కొందరు బాధితులు పట్టణ ప్రముఖులు ఆడిటర్ చేకూరి సాంబశివరావు, లాయర్ ప్రతాప్‌లను కోరారు. పిల్లల పెళ్లిళ్లు, చదువు, భవిష్యత్తు కోసం డబ్బులు దాచుకున్నామని కొందరు.. వ్యాపారాభివృద్ధి కోసం పొదుపు చేశామని మరికొందరు తెలిపారు. శేషజీవితం హాయిగా గడుపుదామని డబ్బులన్నీ అక్కడే పెట్టామని విశ్రాంత ఉద్యోగులు కన్నీటిపర్యంతమయ్యారు.

పుల్లారావు సోదరునిపై ఆగ్రహం

ఓవైపు వందలాది మంది చిట్‌ఫండ్ బాధితులతో సమావేశం అవుతుండగా.. అదే సమయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారావు సోదరుడు అక్కడికి వచ్చారు. దీంతో ఆయనపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోపంతో దుర్భాషలాడారు. సమావేశం అనంతరం గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి, తమకు న్యాయం చేయాలని కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. బాధితులకు అండగా ఉంటామని, న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నరసరావుపేటలో ఆర్థిక నేరాలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. పుల్లారావు కోర్టులో లొంగిపోయిన క్రమంలో కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని.. ఈ నేపథ్యంలో బాధితులు సంయమనం పాటించాలని కోరారు. విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హోం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా తమ వంతు ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

సమావేశమైన చిట్‌ఫండ్ బాధితులు

అన్యాయం చేయాలనే..

మరోవైపు కోర్టులో లొంగిపోయిన చిట్‌ఫండ్ సంస్థ ఎండీ పాలడుగు పుల్లారావు.. ఇవ్వాల్సిన డబ్బులకు మించి తన వద్ద ఆస్తులు ఉన్నాయని.. బాధితులలో కొందరు ఉద్దేశపూర్వకంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని న్యాయస్థానం ఎదుట వాపోయినట్లు తెలుస్తోంది. 20 రోజులుగా అజ్ఞాతంలో ఉన్న పుల్లారావు, అతని కుటుంబ సభ్యులు.. సమీప బంధువైన ఒక సీఐ వద్ద రక్షణ పొందుతున్నారని బాధితులు చెబుతున్నారు. తమకు అన్యాయం చేయాలనే ఉద్దేశంతో పుల్లారావు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు.

కళలకు పూర్వవైభవం అవసరం

ప్రజాశక్తి - వినుకొండ

సినీ, టీవీల సంస్కృతి కారణంగా ప్రస్తుత కాలంలో కళలు అంతరించిపోతున్నాయని, కళాకారులు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ప్రముఖ న్యాయవాది పి.సైదారావు ఆందోళన వ్యక్తం చేశారు. కళలను, కళాకారులను బతికించాల్సిన అవసరం అందరిపైనా ఉందని తెలిపారు. గుమ్మడి కళాపీఠం అధ్వర్యంలో కళాకారుల సమావేశం స్థానిక నరసరావుపేట రోడ్డులో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ప్రముఖ న్యాయవాదులు పి. సైదారావు, ఎస్‌కే సిద్ధయ్య ప్రసంగించారు. కళలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు వినుకొండలో గుమ్మడి కళా పీఠం ద్వారా చేస్తున్న కృషిని ప్రశంసించారు.

నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

పేద బ్రాహ్మణ కుటుంబాలకు దాతల సహకారంతో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు, నిత్యావసర సరకులు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్ధనలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవరూపాన్ని ధరించి సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి, విధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణ లో భారీగా పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 22 దరఖాస్తులు

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు మండలంలో గీత కులాలకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలకు 22 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. పదో తేదీన జిల్లా కేంద్రంలో మద్యం షాపులకు లాటరీ తీయాల్సి ఉండగా.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడినట్లు చెప్పారు. దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

గుడి.. బడి.. మద్యం దుకాణం!

- రద్దీ ప్రాంతాల్లోనే బార్ అండ్ రెస్టారెంట్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జిల్లాలో ఎక్కడా లేనివిధంగా పట్టణంలోని గుళ్లు, మసీదులు, బస్టాండ్లు, హాస్పిటల్స్, నివాస ప్రాంతాల సమీపంలోనే నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రమన్న తేడా లేకుండా మందుబాబుల హడావిడి ఇక్కడ ఉంటోంది. ప్రధానంగా సాయంత్రమైతే రోడ్ల మీదే వీరి హంగామా అధికంగా ఉంటోంది. దీంతో వృద్ధులు, మహిళలు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నిరోధించాల్సిన అధికారులు నామమాత్రంగానైనా చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలో ఆరు వైన్ షాపులున్నాయి. సుమారు 10 వరకు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. పట్టణంలో కళామందిర్ సెంటర్ నిత్యం అత్యంత రద్దీగా ఉంటుంది. దాని చుట్టుపక్కలే బార్ అండ్ రెస్టారెంట్లు దర్శనమిస్తున్నాయి. పట్టణానికి నలుమూలల ఉన్న పల్లెలు, దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్.టి.సి బస్సులు నిలిచే ప్రధాన బస్టాండ్ సమీపంలోనే ఉంది. మసీదు, శివాలయాలు చుట్టూ ఉన్నాయి. పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు ఇక్కడే ఆగుతాయి. చిలకలూరిపేట నుంచి పెదనందిపా డు, వేలూరు, పూనూరు, గుంటూరు, నరసరావుపేట, చీరాల తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇక్కడే ప్రజలు బస్సులు ఎక్కుతూ, దిగుతూ ఉంటారు. ముఖ్యంగా రాత్రి 10 గంటల సమయంలో హైదరాబాద్ వెళ్లే బస్సులు ఇక్కడి నుంచే బయల్దేరుతాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ప్రధాన సెంటర్లో మహిళలు, విద్యార్థినులు మద్యం దుకాణాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్.ఆర్.టి. సెంటర్ దగ్గరగా రైతు బజార్ చుట్టుపక్కల కూడా వైన్‌షాపులున్నాయి. వాటికి కూత వేటు దూరంలోనే ప్రముఖ ఆసుపత్రులు, గృహ సముదాయాలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలోనూ మందుబాబుల ఆగడాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి 16 కూడా పక్కనే ఉంది. అధికారులు దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలు

అలంకారప్రాయంగా ఈ - హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలు

రూ. కోట్లలో ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని పలు గ్రామాల్లో నిర్మించిన ఈ-హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. వ్యాధులు రాకుండా ముందుగానే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పిం చడంతో పాటు వ్యాధిబారిన పడ్డాక వైద్యం అందించడం ఈ - హెల్త్, వెల్‌నెస్ కేంద్రాల ఉద్దేశ్యం. రాయపూడి, తుళ్లూరు, దొండపాడు, బోరుపాలెం గ్రామాల్లో రూ.కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టినా ప్రారంభానికి నోచుకోకపోవ డంతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని పలువురు ఆరోపిస్తు న్నారు. రాయపూడిలో రూ.148.12లక్షల వ్యయంతో ఈ-హెల్త్, వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించారు. ఈ కేంద్రాన్ని గత ప్రభుత్వ హయాం లో అప్పటి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మీ పరిశీలిం చడంతో త్వరలో కేంద్రాన్ని ప్రారంభించి అందుబాటులోకి తెస్తారని గ్రామస్తులు ఆశించారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నా ఈ-సెంటర్ అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాతలు ఇచ్చిన అంబులెన్స్ కూడా నిరుపయోగంగా మారింది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే రాయపూడితో పాటు సమీప గ్రామా లైన అబ్బురాజుపాలెం, ఉద్దండరాయునిపాలెం, లింగాయపాలెం గ్రామాలకు వైద్యసౌకర్యం అందేదని ప్రజలు చెబుతున్నారు.

ప్రారంభానికి నోచని తుళ్లూరులోని ఈ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్

తుళ్లూరులో..

తుళ్లూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం పక్కన రూ. కోటీ, పదమూడు లక్షల, 48 వేలతో ఈ - హెల్త్, వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించారు. ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారడంతో అసాం ఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిం దని స్థానికులు చెబుతున్నారు. భవ నాల నిర్మాణంలో ఉన్న శ్రద్ధ వాటి ప్రారంభం, వైద్యులు, సిబ్బంది నియా మకంలో ఉండడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పక్కనే ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (30 పడకల ఆసుపత్రి) రూ.4కోట్ల వ్యయం తో నిర్మించినా వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించారు. అందులోని వైద్యులు, సిబ్బంది సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉంటూ సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు తక్షణమే స్పందించి ఈ-హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా తుళ్లూరు సామా జిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

68వ రోజు దీక్షల్లో కూర్చున్న కార్మికులు

న్యాయమైన తమ సమస్యను పరిష్కరించాలి

దీక్షల్లో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

ప్రజాశక్తి -తాడేపల్లి

తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఇవ్వాలనీ, కోర్టులు ఇచ్చిన తీర్పులు ప్రభుత్వం అమలు జరిపి తమకు న్యాయం చేయాలని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 68వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎన్.సుబ్బారావు, వై.యహెూశోవ, కే.విజయమోహన్, ఏ.హగ్గయ్య, డి.మాణిక్య రావు, బి.దానయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఎన్.దుర్గారావు, ఎమ్మెల్యే నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 కార్మిక కుటుంబాలతో ముడిపడి ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించి తమ చిత్తశుద్ధిని నిరూపిం చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.అంక య్య, వెంకటేశ్వర్లు, కే జి కే మూర్తి, ఎస్.కె ఆరీఫ్ వై.సాంబయ్య, రమాదేవి, బి నవనీత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రతిభ సాధించిన విద్యార్థిని

కేకే మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని రాష్ట్రస్థాయి ప్రతిభ

ప్రజాశక్తి మంగళగిరి

గుంటూరు హిందూ ఫార్మసీ కాలేజీలో వి.రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కాలిగ్రఫీ పోటీలలో మంగళ గిరి పట్టణంలోని కాండ్రు కమల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.కె. రిజ్వానా రాష్ట్రస్థాయిలో లెవెల్ - 2లో విజయం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ దర్వావళి ఆదివారం తెలిపారు. డీఈవో వి.రేణుక ఆర్జెడి లింగేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

మోసపూరిత కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి : సిపిఎం

ప్రజాశక్తి పెదనందిపాడు

కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ ప్రజల మీద జీఎస్టీ, అధిక ధరలు భారాలు వేస్తున్న మోసపూరిత కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం పెదనంది పాడులో జరిగిన సిపిఎం శాఖ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ఉపాధి కల్పన వంటి అంశాలు లేవన్నారు. మధ్యతరగతికి స్వల్పంగా పన్నులు తగ్గించి, నూటికి 90 శాతం పైగా ఉన్న సామాన్య ప్రజల మీద భారాలు పెంచారన్నారు. వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి, సాంఘిక సంక్షేమానికి బడ్జెట్లో నిధులు కేటాయింపులు పెంచాలని కోరారు. ఆరోగ్య రంగానికి, విద్య, వైద్యం, ప్రజా పంపిణీ వ్యవస్థకు నిధుల కేటాయింపులు పెంచాలన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని కోరారు. రాజధాని అమరావతి నిర్మాణానికి అప్పు రూపంలో కాకుండా, కేంద్రం గ్రాంట్ రూపంలో నిధులు కేటాయించాలన్నారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం సమంజసం కాదన్నారు. వేలకోట్లు సంపద ఉన్న కార్పోరేట్ల మీద పన్నులు పెంచాలని, తద్వారా పేదలకు రాయితీలు తగ్గించకుండా ఉండాలని ప్రత్యామ్నాయ విధానాలు సూచించారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు సభ్యులు జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, పోపూరి సుధీర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

జనార్దన్‌రావుకు నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ దాత విసి జనార్దన్‌రావుకు నివాళులు

ప్రజాశక్తి, పెదనందిపాడు: రోటరీ క్లబ్‌ల ద్వారా పేదలకు కుట్టు మిషన్లు, సైకిళ్లు అందజేయడమే కాకుండా స్థానిక పజలకు విశేష సహాయ సహకారాలు అందించిన రోటరీ క్లబ్ హైదరాబాద్ నార్త్ సభ్యులు, మేజర్ డోనర్, పాల్ హర్రీస్ సొసైటీ సభ్యులు విసి జనార్దన్ రావు మరణానికి చింతిస్తూ ఆదివారం పెదనందిపాడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నల్లపనేని శివప్రసాద్, డైరెక్టర్ పి లక్ష్మీనారాయణ, కోశాధికారి కె నాగేశ్వరరావు, సభ్యులు వై రమణయ్య, ఎం ప్రసాదు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్స్

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ జయంతి బాబు

ప్రజాశక్తి తెనాలిరూరల్

రాబోయే పబ్లిక్ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా రోజూ అధ్యయన గంటలు (స్టడి అవర్స్) నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి-2 వి జయంతి బాబు తెలిపారు. ఆదివారం చెంచుపేటలోని కోగంటి శివయ్య ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్టడి అవర్స్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, డైలీ టెస్ట్ నిర్వహణ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి జీవితంలో టెన్త్ ఒక మైలురాయని, ఉద్యోగావకాశ కల్పనకు టెన్త్ మార్కులు కీలకమన్నారు. ఎ, బి, సి గ్రేడ్స్ వారిగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి తగిన స్థాయిలో డైలీ టెస్టులు నిర్వహిస్తామన్నారు. ప్రీపబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష పత్రాలు ఇప్పటికే మండల విద్యా వనరుల కేంద్రానికి చేరుకున్నాయన్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే గంట ముందు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు పరీక్షాపత్రాలను చేరవేస్తామన్నారు. అదనపు తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్నాక్స్‌తో పాటుగా సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో ఆరోగ్య సంరక్షకులచే నులి పురుగుల మాత్రలు పంపిణి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె రాజారెడ్డి పాల్గొన్నారు.

త్యాగాల ఫలితమే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం : లీగల్ సెల్ కన్వీనర్

ప్రజాశక్తి మంగళగిరి

మాదిగ జాతి అభివృద్ధి, రిజర్వేషన్ ఫలితాల కోసం అమరులైన వారి త్యాగాల ఫలితమే నేటి రిజర్వేషన్ వర్గీకరణ చట్టానికి అంకురార్పణ అని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలుకూరి నాగరాజు మాదిగ అన్నారు. ఆదివారం మంగళగిరి నగరంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగ జాతి అభ్యున్నతే ధ్యేయంగా షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ ప్రధాన లక్ష్యంగా మాదిగ జాతి సర్వతోముఖాభివృద్ధికై తమ జీవితాలను సైతం లెక్క చేయకుండా ప్రాణ త్యాగాలకు సిద్ధపడిందని ఆయన అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన మందా కృష్ణమాదిగ వెంట నడిచిన మిగిలిన వ్యవస్థాపక సభ్యులను ఒకరి తర్వాత ఒకరిని తొలగించి ఎంఆర్పిఎస్‌కు జన్మనిచ్చిన ఈదుమూడి మాదిగపల్లె తలపెట్టిన మందకృష్ణ మాదిగను మాదిగ జాతి క్షమించదని అన్నారు. మన భవిష్యత్‌తరాల అభ్యున్నతి కోసం మన పరిధిలో కొంత మేరకైనా త్యాగం చేయడానికి మానసికంగా సిద్ధపడాలని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల కుటుంబాల కృతజ్ఞతలు పై సమగ్ర అధ్యయనం చేసి వారి త్యాగాలు వృథా కాకుండా చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా మాదిగ అమరవీరుల స్మృతి వనం స్మారక స్తూపాలు ఏర్పాటు చేయాలని, వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలనీ, పిల్లలకు ఉచిత విద్య అందించి ఆదుకోవాలని నాగరాజు మాదిగ రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

పేద ప్రజలకు ఇంటి స్థలాలివ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి మంగళగిరి

నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంగళగిరి పట్టణంలో ఆదివారం శాలివాహన పేట రామాలయం, రత్నాల చెరువు భావన ఋషి స్వామి గుడి వద్ద పేద ప్రజల నుండి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, బాపనపల్లి అంజిబాబు, పాలెం నాసరయ్య పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు అవ్వాలని కోరుతూ అర్జీలను పూర్తిచేసే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని వారు అన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి గండాలయ్య పేటలో స్థానిక సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో డీవైఎఫ్ఐ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎన్.మాధవిలత జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. సాధారణ వైద్య సేవలు, డెంటల్, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ ఎన్ మాధవిలత, డాక్టర్ వంశీకష్ణ మాజేటి, డాక్టర్ కృష్ణ చైతన్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర మెడికల్ ఇన్చార్జి పూసపాటి సాయి కృష్ణ, పట్టణ సత్యసాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రామారావు, సీపీఎం నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, డీవైఎఫ్ఐ నాయకులు ఎన్ నాగేశ్వరరావు, ఎస్ చైతన్య, ఎస్ రమేష్, డీ.కిట్టు సాయి, ఎం రమేష్ బాబు, ఎస్ వెంకటేష్, భజన మండలి ప్రతినిధులు రాధిక, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుండి మంగళగిరిలో సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈనెల 10 నుండి 13వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ -2025 పోటీలు జరగనున్నాయని స్టేడియం నిర్వాహకులు ఆదివారం మీడియాకు తెలిపారు. విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) కార్యాలయం నేతత్వంలో తొలిసారి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబడుతోంది. ఈ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ లో దక్షిణాది నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న జట్లు పాల్గొని తలపడనున్నాయి. తొలిసారిగా ఈ క్రీడలను ఆంధ్రప్రదేశ్ లో నిర్వహిస్తున్నారు. ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్ కు అర్హత పొందేందుకు ఈ టోర్నమెంట్ ఉపయోగపడనుందని ఆడిట్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. టోర్నమెంట్ లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులు జాతీయస్థాయిలో వారి రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పొందుతారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవం 10 ఫిబ్రవరి, 2025న ఉదయం 8 గం.లకు జరుగుతుంది. 13 ఫిబ్రవరి, 2025న మధ్యాహ్నం 1.30 గం.లకు ముగింపు వేడుకతో టోర్నమెంట్ ముగుస్తుంది..క్రీడాభిమానం ఉన్న ప్రతిఒక్కరూ సంబంధిత మ్యాచ్ లు వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అనధికార మాంసం విక్రయాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

షాపులపై దాడులు చేస్తున్న జిఎంసి అధికారులు

ప్రజారోగ్యం దృష్ట్యా నగరంలో అనధికార చేపలు, మాంసం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు జిఎంసి ప్రజా రోగ్య అధికారులు బృందాలుగా ఏర్పడి ఆదివారం నగరంలోని మణిపురం బ్రిడ్జ్ క్రింద చేపల మార్కెట్, నల్లపాడు రోడ్డు, రెడ్డికాలేజీ రోడ్డు, మిర్చియార్డ్, నవభారతనగర్, గోరంట్ల, ఆర్.టి.ఓ ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పొన్నూరురోడ్డు, పట్టాభిపురం ప్రాంతాలలో రోడ్లపై అనధికారికంగా చేపలు, మాంసం విక్రయిస్తున్న వారిని గుర్తించి వారిపై దాడులు నిర్వహించి వాటిని తొలగించి, వారి వద్ద నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా నాటుకోళ్ళు, చేపలు, మాంసం విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు, భారీమొత్తంలో అపరాధ రుసుము విధించటమే కాకుండా చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకొనుట జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి వారం జిఎంసి అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. నగరంలో మాంసం విక్రయాలు జరిపే యజమానులు సంబంధిత డాక్యుమెంట్స్ అందజేసి డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ పొంది, వ్యాపారం నిర్వహించుకోవాలని, లైసెన్స్ లేని వారి షాపులను సీజ్ చేయటం జరుగుతుందని చెప్పారు. లైసెన్స్ పొంది మాంసం విక్రయించే షాపుల యజమానులు తమ షాపు చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మాంసంపై దుమ్ము, ధూళి పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శుభ్రత పాటించని షాపులపై కూడా దాడులు నిర్వహించి చర్యలు తీసుకుం టామని తెలియచేశారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, వెటర్నరి డాక్టర్ వెంకటేశ్వర్లు, యస్.యస్ లు ఆనందకుమార్, సోమశేఖర్, రాంబాబు, అయుబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ఘనంగా చలమయ్య కాలేజి సిల్వర్‌జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. కళాశాల సెక్రెటరీ కర్పూరపు రామకృష్ణ ప్రభు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత 25 సంవత్సరాల డిగ్రీ కళాశాల నివేదికను సభలో ప్రవేశపెట్టారు. లాభాపేక్షతో కాక సేవా తత్పరతతో కళాశాలను నడిపిస్తున్నట్లు చెప్పారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాలలో ఉండటం మాకెంతో గర్వకారణం అని అన్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో కొన్ని విలువలకు కట్టుబడి సేవాభావంతో కళాశాలను నిర్వహించటం అభినందనీయం అన్నారు. కళాశాలలో కార్పొరేట్ స్థాయికి తగినట్లుగా సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన విద్యను పొందటానికి అవకాశం ఉంటుందని అన్నారు. కష్టాన్ని ఇష్టంగా చేసుకుంటే విజయం దానంతట అదే వస్తుందని, ఎల్లప్పుడూ సానుకూల ధృక్పదం అలవరుచుకోవాలన్నారు. కళాపీఠం అధ్యక్షులు ఎస్.వి.ఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లక్ష్యంపై మక్కువ పెంచుకొని ఆదిశగా కృషి చేస్తే విశ్వశక్తి సైతం విజయానికి తోడు అవుతుందని అన్నారు. వేడుకల ప్రారంభంలో విద్యార్థినుల ప్రార్థనాగీతంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ చేతుల మీదుగా కళాశాల లోగోతో కూడిన 25 కేజీల భారీ కేక్‌ను కట్ చేయించారు. నూతనంగా నిర్మించిన సిల్వర్ జూబ్లీబ్లాక్, స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు కర్పూరపు సూర్యనారాయణ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మెంబర్ ఈరంటి వరప్రసాద్, స్థానిక టిడిపి నాయకులు కొనగళ్ళ సత్యం, కార్పొరేటర్ సంకూరి శ్రీను, బాపూజీ కమిటీ అధ్యక్షులు సాధు శివశంకరరావు, కళాశాల అధ్యక్షులు పచ్చిపులుసు రాఘవరావు, మాజేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో మెరుగైన చికిత్సలు అందిస్తాం

- వైద్యులకు, రోగుల మధ్య సంయమనం పెంచుతున్నాం
- డిసెంబరు కల్లా ఎంసిహెచ్ భవనం సిద్ధం
- అత్యవసర విభాగంలో రద్దీ నివారణకు చర్యలు
- ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగు అయిన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ తెలిపారు. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పలు నూతన భవనాలు నిర్మాణంలో ఉన్నాయని వీటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు వెల్లడించారు.

సామాన్య ప్రజలకు చికిత్సలపై భరోసా ఉందా?

తప్పకుండా భరోసా ఉంది. పలు రకాల వ్యాధులతో ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి చికిత్స అందించి పంపడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. తూర్పు గోదావరి నుంచి నెల్లూరు వరకు నిత్యం వందలాది మంది గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారు. కానీ ఇక్కడ నుంచి మరో ఆస్పత్రికి పంపకుండా పూర్తిస్థాయిలో చికిత్స అందించి పంపడమే లక్ష్యంగా పలు మార్పులు చేపట్టామన్నారు.

పొదిల ప్రసాద్ బ్లాక్‌పై నిర్మిస్తున్న రెండు అంతస్తుల్లో ఏయే విభాగాలు వస్తాయి.?

రూ.10 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న ఈ భవనాలకు డాక్టర్ పొదిల ప్రసాద్ రూ.2.20 కోట్లు సాయంగా అందించారు. మిగతా సొమ్ము జింఖానాకు చెందిన ఇతర వైద్యులు అందిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ సర్జికల్, మెడిసిన్, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజి తదితర వార్డులు ఈ రెండు అంతస్తుల్లో ఏర్పాటు అవుతాయి.

రోగులకు అందిస్తున్న చికిత్సలో తీసుకుంటున్న ప్రమాణికాలు?

సాహో అనే నూతన విధానం అమలులోకి తీసుకువచ్చాం. రక్షణ, ఆదరణ, ఆరోగ్య సంరక్షణ, క్రమబద్ధీకరణ (సేఫ్, ఎఫెక్షన్, హెల్త్, ఆర్గనైజింగ్, రెగ్యులేటింగ్) విధానం ద్వారా డాక్టర్లుకు రోగులకు మధ్య అనుసంధానం పెంచాం. ఈవిషయంలో ప్రతి శనివారం డాక్టర్లు, రోగులకు మధ్య సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇరువురు ఒకరిపై మరొకరు అసహనం, కోపం ప్రదర్శించకుండా విజ్ఞప్తి చేసేలా సంయమనంతో చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మనస్సు పెట్టిపని చేయమని తాను వైద్యులను, సిబ్బందికి సూచించా. అలాగే డాక్టర్లు, సిబ్బంది డ్రెస్ కోడ్ తప్పని సరి చేశాం. అలాగే ఆయా వార్డుల్లో ఉన్న వసతులన్ని ఉపయోగించేలా చైతన్యం చేశాం. వివిధ వార్డుల్లో వీల్ చైర్లు లేవనే సమాధానం రాకుండా మొత్తం ఆస్పత్రిలోని వివిధ వార్డుల్లో ఉన్న 250 వీల్ చైర్లను బయటకు తీసి రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఒపి వద్ద రద్దీని తగ్గించేందుకు 19 ఒపి కౌంటర్లు ఏర్పాటు చేశాం. మహిళలు, గర్భిణీలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు విడివిడిగా క్యూ లైన్లను ఏర్పాటు చేశాం.

అత్యవసర చికిత్స వార్డులో రద్దీ నివారణకు చర్యలు?

అత్యవసర చికిత్స వార్డుకు ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ మంది వస్తారు. అ సమయంలో రద్దీ ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని నివారించేందుకు వీలుగా ఈ రోగికి ఏ వార్డులో చికిత్స అవసరమో అక్కడికి తక్షణం పంపేలా చర్యలు తీసుకుంటున్నాము. స్వల్ప గాయాలు అయిన వారికి ప్రాథమిక చికిత్స చేసి వెంటనే డిశ్చార్జి చేస్తున్నారు. గాయాల తీవ్రతను గుర్తించి తక్షణ చికిత్సలకు కృషి జరుగుతోంది. అత్యవసర వార్డులో అదనపు పడకలు ఏర్పాటు చేశాము. ప్రస్తుతం 20 వరకు పడకలు ఉన్నాయి.

నిర్మాణంలో ఉన్న భవనాలు ఎప్పటికి పూర్తవుతాయి?

మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణం వచ్చే డిసెంబరకు నాటికి పూర్తవుతుంది. రూ.80 కోట్లతో నిర్మాణం చేపట్టగా ఎక్విప్ మెంట్ కోసం మరో రూ.30 కోట్లు కేటాయించమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మొత్తం 650 పడకలతో ఈ భవనంలో గర్భిణీలకు డెలివరీ, శస్త్ర చికిత్సలు, మెటర్నటి, ప్రసూతి వైద్య సేవలు అందుతాయి. అలాగే పిల్లలకు చికిత్సలు, శస్త్ర చికిత్సలు ఈ వార్డులోనే ఉంటాయి. అలాగే సర్వీసు బ్లాక్ నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.10 కోట్ల అంచనాలతో పనులకు ప్రభుత్వం ఆమోదించింది. ఈనిధులను ప్రముఖ పారిశ్రామిక వేత్త తులసి రామచంద్రప్రభు అందించారు. ఈ నిర్మాణాలు పూర్తయితే సెంట్రల్ స్టెరిలైజేషన్ విభాగం, బ్లడ్ బ్యాంకు, ఎమటలాజీ విభాగం, రేడియోలాజి, అత్యవసర విభాగం వస్తాయి. డాక్టర్ డైట్ క్యాంటిన్ కూడా ఇందులో వస్తుంది.

ఆస్పత్రిలో వివిధ విభాగాల మధ్య దూరం తగ్గింపు?

వివిధ విభాగాలు, భవనాల మధ్య దూరం తగ్గించేందుకు ఒక బ్లాక్‌కు మరో బ్లాక్‌కు అనుసంధానం ఉండేలా అంతర్గతమార్గాలను ఏర్పాటు చేస్తాం. తద్వారా బయటకు వెళ్లకుండా నివారించవచ్చునని భావిస్తున్నాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పర్యావరణహితంగా గుంటూరు : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత నగరంగా గుంటూరుని తీర్చిదిద్దటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జూనియర్ రెడ్ క్రాస్, భారతీయ విద్యా భవన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'వార్ ఆన్ సింగల్ యూజ్ ప్లాస్టిక్ 'ప్రాజెక్టును ప్రారంభించిన ఆయన ప్రసంగిస్తూ వాడిపడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమి , నదులు, సముద్రాలు కలుషితమై వాటి మీద ఆధారపడి జీవిస్తున్న సమస్త ప్రాణులు నేడు ముప్పును ఎదుర్కొంటున్నాయని, సింగల్ యూస్ ప్లాస్టిక్ ని నివారిస్తేనే మనకు భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలిపారు. గుంటూరు నగరంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వలన కలుగు నష్టాలు, ప్రమాదాలు వంటి అంశాల మీద అవగాహన కలిగించటం ఆనందంగా ఉన్నదని, ప్రాథమిక విద్యా స్థాయి నుండే విద్యార్థు లు ప్లాస్టిక్ నివారణ, పరిశుభ్రత, మొక్కల పెంపకం వంటి పర్యావరణహిత కార్యక్రమాలలో భాగస్వాములు అయి ప్లాస్టిక్ రహిత గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దాలని ఆయన అభివసించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించేందుకు చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ సంస్థ ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లవేళలా ముందు ఉంటుందని, గుంటూరు రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న 'వార్ ఆన్ సింగల్ యూజ్ ప్లాస్టిక్ 'ప్రాజెక్టులకు తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ రవి వడ్లమాని మాట్లాడుతూ నగరంలోని అన్ని పాఠశాలలలో జూనియర్ రెడ్ క్రాస్ వింగ్స్ ని ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్లాస్టిక్ మీద అవగాహన కల్పిస్తూ, వారి ద్వారా వారి నివాస గృహాలలో వాడి పడేసిన ప్లాస్టిక్ ని సేకరించి, బహిరంగ ప్రదేశాలలో ఎక్కడ ప్లాస్టిక్ కనబడని విధంగా రెడ్ క్రాస్ చర్యలు తీసుకోనున్నట్లు డాక్టర్ రవి వడ్లమని తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి రామచంద్ర రాజు మాట్లాడుతూ "వార్ ఆన్ సింగల్ యుజ్ ప్లాస్టిక్ " ప్రాజెక్టు లో నగరంలోని 50000 మంది పాఠశాల విద్యార్థులను భాగస్వాములు చేసి వారి ద్వారా ప్లాస్టిక్ వలన కలుగు నష్టాలను తల్లిదండ్రులకు వివరించి కాటన్ సంచులను వినియోగించు విధంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలను చైతన్య పరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతమగుటకు అన్ని వర్గాల వారు రెడ్ క్రాస్ సొసైటీ కి సహాయ సహకారాలు అందజేయాలని తెలిపారు. పర్యావరణహిత నగరంగా గుంటూరుని తీర్చిదిద్ది భారతదేశంలోనే క్లీన్ అండ్ గ్రీన్ స్మార్ట్ సిటీగా గుంటూరు నుండి నిలుపుటకు కృషి చేయనున్నట్లు తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు రవి శ్రీనివాస్, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, మట్టుపల్లి మోహన్, డాక్టర్ రమణ యశస్వి, బచ్చు నరసింహారావు, భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపల్ శ్రీమతి హేమాంబ తదితరులు పాల్గొన్నారు.